శ్రీనిధి చేయూత

కర్నూలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణ కారణంగా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు భారీగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది. బ్యాంక్ లింకేజీ రుణాలు ఇస్తూనే.. మరో వైపు స్త్రీనిధి క్రెడిట్ ఫెడరేషన్ సంస్థ ద్వారా మహిళలకు తక్కువ వడ్డీలకు వివిధ స్వయం ఉపాధుల కోసం రుణాలను అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే మహిళలకు రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 19,575 మంది మహిళలకు రూ.195 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం కాగా.. ఇప్పటికే రూ.30.01 కోట్లు అందించారు.

- గ్రామీణ మహిళల్లో ఆర్థిక వికాసం
- 19,575 మంది మహిళల స్వయం ఉపాధికి భరోసా
- రూ.195.62 కోట్ల రుణాల మంజూరు లక్ష్యం
- ఇప్పటికే రూ.30.01 కోట్లు మంజూరు చేసిన అధికారులు



చేనేత మగ్గం ద్వారా ఉపాధి పొందుతున్న సి.లక్ష్మి

కర్నూలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 32 వేలకు పైగా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఉన్నాయి. ఒక్కో సంఘంలో పది మంది మహిళలు సభ్యులుగా ఉంటూ నెలకు రూపాయి చొప్పున పొదుపు చేస్తున్నారు. 1994-95 మధ్యలో పొదుపు ఉద్యమానికి బీజం వేసిన సీఎం చంద్రబాబు మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేశారు. జిల్లాలో సుమారుగా 3.25 లక్షల మంది పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వివిధ స్వయం ఉపాదులకు రుణాలు తీసుకుంటూ క్రమం తప్పక చెల్లిస్తూ ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థిక వికాసం కోసం అమలు చేస్తున్న పథకాల్లో 'స్త్రీనిధి' ఒకటి. ఒక్కో ఎస్‌హెచ్‌జీకి రూ.5 లక్షల వరకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తారు. స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా ఉన్న మహిళలు వ్యవసాయం, పొట్టేళ్లు, గేదెలు, కోళ్ల పెంపకంతో పాటు చిరు వ్యాపారాలు, చేతి వృత్తుల కోసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు తీసుకునే అవకాశం కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 19,575 మంది మహిళలకు రూ.195.62 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే 1,005 ఎస్‌హెచ్‌జీల్లో 4,336 మంది మహిళలకు రూ.30.01 కోట్లు మంజూరు చేశామని స్త్రీనిధి ఏజీఎం తేజేశ్వరరావు తెలిపారు. బీమా సౌకర్యం కూడా ఉంది. రుణం తీసుకున్న మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే తీసుకున్న రుణం చెల్లించాల్సిన అవసరం లేదు. స్త్రీనిధి గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి అండగా ఉందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.



● 96.85 శాతానికి పైగా రికవరీ

స్త్రీనిధి రుణాలు మంజూరులోనే కాదు.. రికవరీలోనూ ముందంజలో ఉన్నారు. 2024-25లో 19,501 మంది మహిళలకు రూ.127 కోట్లు స్త్రీనిధి రుణాలు మంజూరు చేశారు. సకాలంలో రూ.123.01కోట్లు వసూళ్లు చేసి 96.85 శాతం రికవరీ లక్ష్యానికి చేరుకున్నారు. స్త్రీనిధి డబ్బు బ్యాంకులకు చెల్లించే క్రమంలో వీవోఏలు చేతి వాటం ప్రదర్శించే అవకాశం లేకుండా ఈ ఏడాది నుంచి పేటీఎం చెల్లింపులు అమలులోకి తీసుకొచ్చారు.

● స్త్రీనిధి డబ్బుతో సొంత మగ్గం

చేనేత మగ్గం పట్టుచీరలు ఉత్పత్తి చేస్తున్న చేనేత కార్మికురాలి పేరు సి.లక్ష్మి. పత్తికొండ స్వగ్రామం. ఆర్థిక స్థోమం లేకపోవడంతో అద్దె మగ్గం పైనే పట్టుచీరలు నేసేది. పొదుపు సంఘంలో సభ్యురాలిగా చేరింది. చౌడేశ్వరి గ్రామాఖ్య సంఘంలోని మేరీ ఎస్‌హెచ్‌జీ నుంచి రూ.50 వేలు రుణం తీసుకొని సొంతంగా మగ్గం ఏర్పాటు చేసుకుంది. అద్దె మగ్గం ఉన్నప్పుడు నెలకు రూ.6-8 వేలు సంపాదిస్తే, సొంత మగ్గం ఏర్పాటు చేసుకోవడంతో నెలకు రూ.15-18 వేల వరకు సంపాదిస్తుంది. స్త్రీనిధి మాకు ఆర్థిక భరోసా ఇచ్చిందని ఆమె వివరించారు.

● అవినీతికి ఆస్కారం లేని విధానం

స్త్రీనిధి రుణాలు మంజూరులో గతంలో అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. వీవోఏలు చెప్పడంతోనే మంజూరు చేయడంతో పలు చోట్ల రుణాలు పక్కదారి పట్టాయనే ఆరోపణలు లేకపోలేదు. అవినీతికి ఆస్కారం లేకుండా, నిధులు పక్కదారి పట్టకుండా కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త నిబంధనలు అమలు చేస్తున్నారు. రుణం అవసరమైన స్వయం సహాయక సంఘాల సభ్యులు దరఖాస్తు చేస్తే, వీవోఏలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. బయోమెట్రిక్ తీసుకోవడంతో పాటుగా మేనేజరు ఆ సంఘానికి వెళ్లి మహిళలతో ఎందుకోసం రుణం తీసుకుంటారు, ఎటువంటి వ్యాపారం చేస్తున్నారు..? వంటి వివరాలు తెలుసుకున్న తరువాతే ఆన్‌లైన్‌లో రుణాలు మంజూరు చేస్తారు. దీంతో ఎక్కడ కూడా నిధులు పక్కదారి పట్టే అవకాశం లేదని మహిళలు పేర్కొంటున్నారు. 125 రకాల జీవనోపాధులకు ఈ రుణాలు మంజూరు చేస్తారు. అంతేకాదు.. ఎన్టీఆర్ విద్య సంకల్పం పథకం ద్వారా స్త్రీనిధిలో భాగంగా డ్వాక్రా మహిళల పిల్లలకు చదువులకు 35 పైసల వడ్డీకి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ఇస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు వినియోగించుకోవడానికి అవకావం ఉంది. విద్య కోసం తీసుకున్న రుణాలను 2-3 ఏళ్ల కాల పరిధిలో చెల్లించాల్సి ఉంటుంది.

మిగతా7లో

కేజీబీవీ టీచర్లకు శిక్షణ ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి కేజీబీవీలలో పని చేస్తున్న 120 మంది ఇంగ్లీష్ పీజీటీలకు ఆదివారం శిక్షణ ప్రారంభమైంది. కర్నూలు నగర శివారు పరిధిలోని రాఘవేంద్ర బీఈడీ కళాశాలలో ఈ నెల 7వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అదనపు పతక సంచాలకుడు డా.ప్రసన్నకుమార్ బోధనకు సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు డీఈవో శామ్యూల్ పాల్, కర్నూలు, నంద్యాల జిల్లాల జీసీడీవోలు స్నేహలత, సువర్చల, ఆరుగురు రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

హాలహర్వి సర్పంచ్‌కు ఢిల్లీకి ఆహ్వానం

● స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొననున్న మల్లికార్జున



హాలహర్వి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు కర్నూలు జిల్లాకు చెందిన హాలహర్వి సర్పంచ్ మల్లికార్జునకు ఆహ్వానం లభించింది. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ జెండా ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని, అందుకు కేంద్రమే ఖర్చులు భరిస్తున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌గా ప్రశంసా పత్రం అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

విలువల్లేని పార్టీ వైసీపీ

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విలువలు, విశ్వసనీయత లేని పార్టీ వైసీపీ అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటనను విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేపై నీచంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు ప్రసన్నకుమార్ రెడ్డిని వైఎస్ జగన్ పరామర్శించడం సిగ్గుచేటన్నారు. ఆస్తికోసం తల్లి, చెల్లి మీద వేసిన కేసులో విజయం సాధించిన వీరుడిగా చరిత్రలో జగన్ నిలిచిపోయాడన్నారు. జగన్ నెల్లూరు టూర్ అట్టర్‌ప్లాప్ అయిందని గ్రాఫిక్స్‌తో బంగారుపాళ్యం జనాన్ని చూపించాల్సిన దుస్థితికి దిగజారడని విమర్శించారు. వైసీపీ నేతలకు మాత్రమే కుటుంబాలు ఉన్నట్టు, రాష్ట్రంలో ఎవరికీ కుటుంబాలు లేనట్టు జగన్ వాపోతున్నాడని అసహనం వ్యక్తం చేశారు. మహిళలను తక్కువ చేసి చూపే వైసీపీ, అధినేత వైఎస్ జగన్‌ను ప్రజలను ఛీదరించుకుంటున్నారన్నారు.



కోసిగి ప్రధాన రోడ్డులో బారులు దీరిన ఉరుకుందకు వెళ్లే వాహనాలు

దారులన్నీ అటువైపే..!

- ఉరుకుంద క్షేత్రానికి బారులు దీరిన వాహనాలు
- 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



కోసిగిలో ట్రాఫిక్‌జామ్‌ను క్లియర్ చేస్తున్న ఎస్ఐ హనుమంతరెడ్డి

కోసిగి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ప్రముఖ క్షేత్రం ఉరుకుందకు భక్తులు వేలాదిగా తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో క్షేత్రానికి వెళ్లే దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. శ్రావణ సోమవారం ఈరన్నస్వామికి జరిగే పూజల్లో పాల్గొనేందుకు ఆదివారం నుంచి భక్తులు బయల్దేరారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో వాహనాలు ఉరుకుంద క్షేత్రానికి వెళ్తున్నాయి. బారులు దీరాయి. శ్రావణమాసంలో ఉరుకుంద ఈరన్న స్వామికి మూడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తుండటంతో కోసిగిలో ప్రధాన రోడ్డు నుంచి జుమాలదిన్నె గ్రామం వరకు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎస్ఐ హనుమంతురెడ్డి కోసిగిలో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో మత్స్యశాఖ కమిషనర్



శ్రీమఠం పీఠాధిపతితో ఆశీస్సులు పొందుతున్న రాం శంకర్ నాయక్

మంత్రాలయం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ రాం శంకర్ నాయక్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి కూడా దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వీరిని మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మఠం అధికారులు వ్యాసరాజ ఆచార్, స్వామిరాయ్, ప్రకాష్ ఆచార్ పాల్గొన్నారు.

వికసించిన రాఖీ పుష్పం



గోనెగండ్లలో వికసించిన రాఖీ పుష్పం

గోనెగండ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో అరుదుగా వికసించేవి రాఖీ పుష్పాలు. గోనెగండ్ల డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు పెరట్లో ఈ పుష్పాలు ఆదివారం వికసించాయి. స్థానికంగా ఈ పుష్పాలను రాఖీ, శ్రీకృష్ణ పుష్పాలని, మరికొందరు కౌరవ, పాండవ పుష్పాలని పిలుస్తారు. డీటీ గురురాజారావు మాట్లాడుతూ ఈ పుష్పాలను కొమ్మ నుంచి వేరుచేసిన అరగంట తర్వాత సుగంధ పరిమళం వెదజల్లుతుందన్నారు. ఈ పుష్పాలను దైవానికి మాత్రమే సమర్పిస్తామని తెలిపారు.

నాలుగు నెలల్లో హైకోర్టు బెంచ్

- ఓర్వకల్లులో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు
- ఐదేళ్లు వైసీపీ విధ్వంసం చేస్తే.. చంద్రబాబు సరి చేస్తున్నారు
- అత్యున్నత పారిశ్రామిక పాలసీ కోసం రూపకల్పన
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు నుంచి క్లియరెన్స్ రాగానే నాలుగు నెలల్లో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని, ఆ దిశగా సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఆదివారం కర్నూలులోని మౌర్యఇన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు, సింగపూర్ పర్యటన్ సక్సెస్, రాయలసీమ ప్రాజెక్టులు, జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులు.. వంటి అంశాలను వివరించారు. అదే క్రమంలో గత ఐదేళ్లు రాష్ట్రాన్ని వైసీపీ ఏ రీతిన విధ్వంసం, వినాశనం చేసిందో ఘాటుగా స్పందించారు. జిల్లాకు చెందిన వ్యక్తిగా ఈ జిల్లాకు ఎక్కువ పెట్టుబడులు రాబట్టేందుకు మంత్రిగా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ.10 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. దేశంలోనే దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం తమ ప్రభుత్వం సాధించిన ఘనతగా వివరించారు. కర్నూలు విమానాశ్రయంలో రెండు పైలెట్ శిక్షణ సంస్థలు రాబోతున్నాయని, పైలెట్ శిక్షణ పూర్తి చేస్తే రూ.లక్షల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ రూ.2,850 కోట్లులో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నీటి సౌకర్యం కల్పించే పైపులైన్ కూడా వేయకపోతే మన ప్రభుత్వం వచ్చాక 90 శాతం పూర్తి చేశామన్నారు. పశ్చిమ ప్రాంతంలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కరువు, వలసలు నివారించవచ్చని, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. పత్తికొండ టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను తన హయాంలో పనులు మొదలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. హంద్రీనీవా కాలువను 120 రోజుల్లో 3,850 క్యూసెక్కులకు విస్తరించి రికార్డు సృష్టించామని తెలిపారు.

మిగతా 7లో..

అఖండ భారత్ సంకల్ప్ దివస్‌ను ఘనంగా నిర్వహిద్దాం 7

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు 7

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు
● నలుగురు స్నేహితులకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

వైన్ షాపులో వ్యక్తి మృతి 7

అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ

● కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కంటే అవయవదానం ఎంతో గొప్పదని, అవయవదానం వల్ల ఇతరులకు పునర్జన్మ ప్రసాదించవచ్చని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య విద్యార్థుల అవగాహన ర్యాలీని సూపరింటెండెంట్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అవయవదానం వల్ల కొన్ని కుటుంబాల్లో వెలుగు వస్తుందన్నారు. కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, జీర్ణ వ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు, చర్మం వంటి 8 అవయవాలను దానం చేయవచ్చన్నారు. ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లెక్కల ప్రకారం సంవత్సరానికి 1.50 నుంచి 2 లక్షల మందికి కిడ్నీ మార్పిడి అవసరమవుతుండగా.. కేవలం 8వేల మందికే కిడ్నీలు అందుతున్నాయని చెప్పారు. ప్రతి రోజు రోడ్డు ప్రమాదంలో ఎంతో మంది బ్రెయిన్ డెత్‌తో మరణిస్తున్నారని, వారి అవయవాలు దానం చేస్తే ఇతరులకు పునర్జన్మ ప్రసాదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యం, యురాలజీ హెచ్‌వోడీ ముత్యాశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ బాల రవితేజ, నెఫ్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పక్కీరెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శివ బాల, కిరణ్ కుమార్, ఏఆర్ఎంవో సునీల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పంట ఉత్పత్తులతో మార్కెట్ కళకళ

- ఎమ్మిగనూరుకు వచ్చిన 18,063 బస్తాల వేరుశనగ దిగుబడి
- గరిష్ఠ ధర రూ.6,933
- రెండు వారాలతో పోలిస్తే రూ.100 తగ్గిన రేటు



ఎమ్మిగనూరు మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ దిగుబడి

ఎమ్మిగనూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నాలుగైదు నెలలుగా వెలవెలబోయిన ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదివారం పంట ఉత్పత్తులతో కళకళలాడింది. ఎమ్మిగనూరు చుట్టు ప్రాంతాల నుంచే కాకుండా గోనెగండ్ల, సి.బెళగల్, క్రిష్ణగిరి, దేవనకొండ, పెద్దకడుబూరు మండలాల నుంచి రైతులు పెద్ద ఎత్తున వేరుశనగ పంట ఉత్పత్తులను తీసుకొచ్చారు. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణ రైతులు, వ్యాపారులు, హమాలీలతో కళకళలాడింది. వేరుశనగ 18,063 బస్తాలు(5419 క్వింటాళ్లు) అమ్మకానికి వచ్చాయి. వేరుశనగ క్వింటం గరిష్ఠ ధర రూ. 6,933, మధ్యస్థం రూ. 6,170, కనిష్ఠం రూ.3,006 పలికింది. గత రెండు వారాలతో పోలిస్తే రూ.100 తగ్గింది. కాగా వేసవి కాలం సీజన్‌లో భారీగా రావాల్సిన పంట ఉత్పత్తులు ఏమాత్రం రాకపోవటంతో మార్కెట్ కమిటీ నాలుగైదు నెలలుగా వెలవెలబోయింది. దీంతో వ్యాపారాలు లేక కమీషన్ ఏజెంట్లు, కొనుగోలుదారులు ఒకింత ఇబ్బందికి గురయ్యారు. ఇక మార్కెట్‌పై ఆధారపడే హమాలీలు, వేమెన్లు, ఎద్దుల బండ్ల నిర్వాహకులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇప్పుడిప్పుడే వారం రోజుల నుంచి మార్కెట్‌కు పంట ఉత్పత్తులు రావటం ప్రారంభం కావటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అఖండ భారత్ సంకల్ప్ దివస్‌ను ఘనంగా నిర్వహిద్దాం

● వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి



మాట్లాడుతున్న టీసీ మద్దిలేటి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 14న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'అఖండ భారత్ సంకల్ప్ దివస్'ను ఘనంగా నిర్వహిద్దామని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిత్య నిలయం పాఠశాలలో వీహెచ్‌పీ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన టీసీ మద్దిలేటి మాట్లాడుతూ 1947 ఆగస్టు 14న అర్ధరాత్రి దేశం రెండు ముక్కలుగా చీలిపోయిందని, ఎప్పటికైనా అఖండ భారతదేశాన్ని సాధించుకుంటామనే దృఢ సంకల్పంతో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అఖండ భారత్ సంకల్ప్ దివస్ కార్యక్రమాలు ఏటా లక్షలాది మంది దేశభక్తులతో నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 14న సాయంత్రం 5:30 గంటలకు నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూకాలనీలోగల భరత మాత ఆలయంలో నిర్వహిస్తున్న అఖండ భారత్ సంకల్ప్ దివస్ వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కోరారు. వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య సంకల్ప్ దివస్ కార్యక్రమాల కరపత్రాన్ని విడుదల చేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరాజులు హైందవ శంఖారావం సభలో చిన్నజీయర్ స్వామీజీ ఆలయాల విముక్తికై చేయించిన ప్రతిజ్ఞను సభ్యులతో చేయించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవయ్య, స్వత్మానంద స్వామి, వీహెచ్‌పీ నాయకులు గోరంట్ల రమణ, నందడి మహేష్, రాంబాబు, ఈపూరి నాగరాజు, దుర్గావాహిని తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

● 5 తులాల బంగారం, 10 తులాల వెండి నగలు స్వాధీనం



నిందితులను, స్వాధీనం చేసుకున్న నగలను చూపిస్తున్న పోలీసులు

ప్యాపిలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన వివిధ చోరీ కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆదివారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో నిందితులను హాజరుపరిచి సీఐ వెంకటరామిరెడ్డి కేసుల వివరాలు విలేకరులకు వెల్లడించారు. మండలంలోని హుసేనాపురం గ్రామంలో రెండు, మామిళ్లపల్లి గ్రామంలో ఒక చోరీ జరిగింది. ఈ ఏడాది జూన్, జూలై మాసాల్లో ఈ చోరీలకు సంబంధించి జలదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులకు సంబంధించిన నిందితులను ఆదివారం మండలంలోని చిగురుమాను దగ్గర ఎస్ఐ నాగార్జున, పోలీసు సిబ్బంది అరెస్టు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా తొండపాడుకు చెందిన మునగాల సుంకన్న, అదే జిల్లా యాడికి గ్రామానికి చెందిన జోగి రాజాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5 తులాల బంగారు, 10 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరూ మిక్సీలు, గ్యాస్ స్టవ్‌ల రిపేరీ పేరుతో గ్రామాల్లో తిరిగే వారని సీఐ తెలిపారు. ఇళ్లకు తాళాలు వేయడాన్ని గుర్తించి రాత్రిపూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. అలాగే కేసులను ఛేదించి, నిందితులను అరెస్టు చేసిన జలదుర్గం ఎస్ఐ నాగార్జునను, సిబ్బంది నీలకంఠ, రమణ, మాధవ రెడ్డి, వెంకటరాజు, మాదన్న, నరసయ్య, మద్దిలేటి, అశోక్, హుసేన్ బాషా, మహబూబ్ బాషాను సీఐ అభినందించారు.

'స్త్రీనిధి' చేయూత

5వ పేజీ (తరువాయి)

● ఎంబ్రాయిడర్ యంత్రం ద్వారా ఉపాధి



ఈమె పేరు దీపిక. ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామం. చేతి ద్వారా ఎంబ్రాయిడర్ వర్క్ పని చేసేది. వారంలో నెలలో రెండు మూడు బ్లౌజ్‌లకు మించి ఎంబ్రాయిడర్ వర్క్ చేసే అవకాశం ఉండేది కాదు. శాంతి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరిన ఆమె స్త్రీనిధి నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నారు. అధునాత ఎంబ్రాయిడర్ యంత్రం కొనుగోలు చేశారు. ఉన్న ఊళ్లోనే యంత్రం ద్వారా ఎంబ్రాయిడర్ వర్క్ చేస్తూ నెలకు రూ.15-20 వేలకు పైగా సంపాదిస్తున్నారు.

● విస్తర్ల ద్వారా జీవనోపాధి



విస్తర్ల యంత్రాలను చూపుతున్న ఆమె పేరు విశాలాక్షి. హాలహర్వి మండలం జె.హోసళ్లి స్వగ్రామం. వ్యవసాయమే జీవనాధారం. విస్తర్ల తయారీ నైపుణ్యం ఉన్నా ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. వారికి స్త్రీనిధి అండగా నిలిచింది. పారిజాతం స్వయం సహాయక సంఘం ద్వారా స్త్రీనిధి బ్యాంక్ నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నారు. విస్తర్ల తయారీ యంత్రం కొనుగోలు చేసి ఉన్న ఊళ్లో.. సొంత ఇంట్లోనే స్వయం ఉపాధి పొందుతున్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా



స్త్రీనిధి గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తుంది. ఈ ఏడాది 19,575 మందికి రూ.195 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 4,336 మందికి రూ.30 కోట్లు ఇచ్చాం. ఇంకా రూ.165 కోట్లు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. వివిధ జీవనోపాధులకు రుణాలు తీసుకోవచ్చు. అలాగే ఎస్‌హెచ్‌జీ సంఘాల్లో ఉన్న మహిళలు తమ పిల్లల చదువుల కోసం ఎన్టీఆర్ విద్య సంకల్పం కింద రుణాలు తీసుకోవచ్చు. బీమా సౌకర్యం ఉండడంతో రుణాలు తీసుకున్న మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ రుణం మాఫీ అవుతుంది. నిధులు పక్కదారి పట్టేందుకు అవకాశం లేకుండా ఆన్‌లైన్‌లో రుణాలు మంజూరు చేస్తాం. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మరింత రుణం తీసుకునే అవకాశంతో పాటు ఇతరులకు అవకాశం లభిస్తుంది. గతేడాది 96.85 శాతం రికవరీ సాధించాం.

– వైపీ రమణారెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ-వెలుగు, కర్నూలు

నాలుగు నెలల్లో హైకోర్టు బెంచ్

5వపేజీ తరువాయి

● ప్రభుత్వం మారడంతో భారీ నష్టం



దేశంలో గుజరాత్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉండడానికి కారణం అక్కడ సుదీర్ఘంగా ఒకే ప్రభుత్వం కొనసాగడమేనని మంత్రి టీజీ భరత్ అన్నారు. 'రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య సీఎం చంద్రబాబు ఏపీ ఓ స్థాయికి తీసుకెళ్లాడు. టీడీపీ ప్రభుత్వం మళ్లీ వచ్చి ఉంటే ఏపీ అగ్రస్థానంలో ఉండేది.. దురదృష్టవశాత్తు వచ్చిన వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేయడంతో పెట్టుబడులు పెట్టేందుకు భయపడే పరిస్థితి ఏర్పడింది' అన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ రావడంతో వైసీపీ చేసిన విధ్వంసాన్ని సీఎం చంద్రబాబు సరి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నాడని తెలిపారు. ఉమ్మడి ఏపీలో 1999లో రెండవ పర్యాయం టీడీపీ ప్రభుత్వం రాకపోయి ఉంటే హైదరాబాద్‌కు హైటెక్ సిటీ, రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చేదా..? అని ప్రశ్నించారు. తమిళనాడు తరహాలో రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. వైసీపీ తన విధానాలు మార్చుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ఒక సీటుకే పరిమితం కావాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో మంత్రులు నారా లోకేశ్, నారాయణలతో కలసి ఐదు రోజుల సింగపూర్ పర్యటన సూపర్ సక్సెస్ అయ్యిందని మంత్రి టీజీ భరత్ వివరించారు.

● ప్రజల్లో రెట్టింపు సంతృప్తి

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. 'ఏడాదిలోనే వృద్ధుల పింఛన్ రూ.4 వేలు, వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాం. ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను విజయవంతంగా అమలు చేశాం. ఈ నెల 7న చేనేతలకు ఉచిత విద్యుత్, 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నాం..' అని అన్నారు. సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లినా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంపై రెట్టింపు సంతృప్తి, ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు. టిడ్కో గృహాలను కూడా పేదలకు త్వరలోనే అందజేస్తామని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

● నలుగురు స్నేహితులకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఆదోని రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలోని కపటి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు స్నేహితులు గాయపడగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. కపటి గ్రామానికి చెందిన చరణ్ స్వామి, గిరి, మంజు, మారుతి చిన్ననాటి స్నేహితులు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా నలుగురు కలిసి కారులో ఆదోనికి బయల్దేరారు. తిరిగి 3గంటల సమయంలో గ్రామానికి బయల్దేరారు. గ్రామానికి సమీపంలో కారు విద్యుత్ పోల్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. విద్యుత్ పోల్ విరిగి పడడంతోపాటు కారులో ఉన్న మంజు, గిరికి తీవ్ర గాయాలయ్యాయి. చరణ్ స్వామి, మారుతి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహబంధం ఎంతో ముఖ్యం

● కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న కేఎంసీ విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మధ్య స్నేహభావం ఎంతో ముఖ్యమని జీవితంలో విద్యార్థి దశ మరువరానిదని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో యూజీ హాస్పిటల్‌లో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు ఒకరికొకరు షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారన్నారు. విద్యార్థులంతా ఒక్కటేనని స్నేహపూర్వకంగా కలిసి మెలిసి ఉండాలని ప్రిన్సిపాల్ కోరారు. వైద్య విద్యార్థులు సమాజానికి ఎంతో సేవ చేయాల్సి ఉందని, ఎంతో కష్టపడి కాలేజీ వచ్చారని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ అలాగే యూజీ హాస్టల్ చీఫ్ వార్డెన్ డాక్టర్ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హాస్టల్ డిప్యూటీ వార్డెన్ డా.సోమశేఖర్, అసిస్టెంట్ వార్డెన్ డా.వెంకటేశ్వర్లు, పీఆర్వో బర్మా సురేష్ కుమార్ పాల్గొన్నారు.

వైన్ షాపులో వ్యక్తి మృతి

● మృతదేహాన్ని బయట పడేసిన నిర్వాహకులు



వైన్ షాపు పక్కన రామాంజనేయులు మృతదేహం

కోడుమూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరుకు చెందిన రామాంజనేయులు (38) అనే వ్యక్తి ఓ వైన్ షాపులో మద్యం తాగి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని శ్రీలక్ష్మీ వైన్స్ షాపు నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పర్మిమిట్ రూములను ఏర్పాటు చేశారు. రామాంజేయులు అనే వ్యక్తి వైన్ షాపులో మందు తీసుకొని అనధికారికంగా ఏర్పాటు చేసిన పర్మిమిట్ రూంలో మందు తాగాడు. మందు తాగిన కొద్ది సేపటికే కుప్పకూలాడు. రామాంజనేయులు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న నిర్వాహకులు మృతదేహాన్ని తీసుకొచ్చి పక్కనే మరో షాపు ముందు పడేశారు. తమకు ఏమి సంబంధం లేనట్లు ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. తాగుడుకు బానిస కావడం వలన మృతుడికి పెళ్లి కాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉత్సవాలకు రండి...

- కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి శ్రీమఠం ఆహ్వానం



కిషన్ రెడ్డికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న శ్రీమఠం సూపరింటెండెంట్ అనంతపురాణిక్

మంత్రాలయం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని కేంద్ర టూరిజం సహాయ మంత్రి కిషన్ రెడ్డికి శ్రీమఠం అధికారులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని కేంద్రమంత్రి నివాసంలో శ్రీమఠం సూపరింటెండెంట్ అనంత పురాణిక్ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వాన పత్రికతో పాటు మఠం జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రితో పీఠాధిపతి ఫోన్‌లో మాట్లాడారు.

ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక ఏపీహెచ్‌ఎంఏ భవనంలో 2025-27 విద్యాసంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వై.నారాయణ, జనరల్ సెక్రటరీగా బీసీ హుశేన్, కోశాధికారిగా రమేష్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక కార్యక్రమాన్ని రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాష్ట్ర కౌన్సిలర్ జి.ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆళ్లగడ్డలో దొంగతనం

● రూ. 4.5 లక్షలు, 4 తులాల బంగారం అపహరణ



ఇంటి తలుపులు పగుల గొట్టిన దొంగలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొరుగుల బట్టి వీధిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. వివరాలివీ.. కాలనీకి చెందిన బండల వ్యాపారం చేసుకొనే సంజీవ రాయుడు అనే వ్యక్తి తన ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి చర్చికి వెళ్లారు. అక్కడి నుంచి బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంజీవరాయుడు ఇంట్లో బీరువాను రాడ్డుతో తొలగించి అందులో కూతురు పెళ్లి కోసం దాచుకున్న రూ. 4.50 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐ జయప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆదివారం ఉలిందకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఈవీ. రమణ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి , నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, గౌరు జనార్దన్‌రెడ్డి హాజరై ఉలిందకొండ పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా టి.మురళి, బి.నాగరాజులను ఆ శాఖ సీఈఓ బి.హరీఫ్ బాషా ప్రమాణం చేయించారు. గౌరుచరిత మాట్లాడుతూ సహకార సంఘాల్లో రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందించి వారిని అప్పుల ఊబీలో పడకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు పెట్టుబడి సాయం అందించి భరోసా కల్పిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ అర్హులైన రైతులకు పార దర్శకంగా రుణాలు అందించి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏపీ సీడ్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పదవులు వరిస్తాయన్నారు. ఈవీ రమణ మాట్లాడుతూ ఉలిందకొండ ప్రాథమిక సహకార సంఘం పరిధిలో వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సొసైటీలో రైతులకు రుణాలు అందించి సంస్థను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యక్ర మంలో పాణ్యం పరిశీలకుడు ఆదెన్న, డి.రామాంజనేయులు, యుద్ధం శ్రీనివాసులు, వాకిటి మాదేష్, కె.ధనుంజయ, కాసాని మహేష్‌గౌడ్, టి.వినోద్, ఈవీ రమణ యువసేన నాయకులు ఈవీ శ్రీకాంత్, షేక్షావలి, సి.రమణ, విక్రమ్‌కుమార్, మధు, రాజేష్, చిన్నమారెన్న, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



ఉలిందకొండ పీఏసీఎస్ చైర్మన్ ఈవీ రమణ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్



గౌరు దంపతులను గజమాలతో సన్మానిస్తున్న ఈవీ రమణ దంపతులు

'అన్నదాత సుఖీభవ'తో రైతుల్లో ఆనందం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని తెలుగు యువత మండల అధ్యక్షుడు సుమన్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని ఆర్.కానాపురం గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా రైతులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ మునిస్వామి, మన్నెం కొండ, ఎల్లప్ప, కృష్ణ, పెద్దనరసింహులు, సుభాన్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. నాయకులు సురేష్, నారాయణ, అయ్యవారి నాయుడు, కేశ వులు, సురేష్, ఎంజీబీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాల డయాసిస్ బిషప్‌గా సంతోష్ ప్రసన్నరావు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌పీజీ అధ్యక్ష ఖండం (డయాసిస్) బిషప్‌గా కమనూరి సంతోష్ ప్రసన్నరావు ఎన్నికయ్యారు. ఆదివారం చెన్నైలోని సినాడ్(బిషప్‌ల నియామక విభాగం) సభ్యులు ఎన్నుకున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన నంద్యాల డయాసిస్ బిషప్ ఎన్నికల్లో ప్రస్తుతం ఎన్నికైన బిషప్‌తోపాటూ రెవ. నందం ఐజాక్, రెవ. సాల్మన్, రెవ. ఐజాక్ ప్రసన్నకుమార్‌లు పోటీ పడ్డారు. కాగా అప్పుడు సినాడ్ డయాసిస్‌లో మోడరేటర్ లేకపోవడంతో ఈఎన్నిక ఆలస్యమైంది. ఇటీవల సినాడ్‌లో మోడరేటర్‌ను ఎన్నుకున్న తరుణంలో సభ్యులంతా సంతోష్ ప్రసన్నరావును నంద్యాల డయాసిస్ బిషప్‌గా ఎన్నుకున్నారు. సంతోష్ ప్రసన్నరావు కడప జిల్లా కలసపాడుకు చెందిన వారు. కర్నూలులోని సీఎస్ఐ చర్చిలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. మంగళవారం నంద్యాల కేథడ్రిల్ చర్చిలో సంతోష్‌కుమార్‌కు బిషప్ పట్టాభిషేకం జరుగుతుందని సీఎస్ఐ చర్చి ప్రతినిధులు తెలిపారు.

'క్రెడాయ్' సామాజిక బాధ్యత అభినందనీయం: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగ సంస్థ కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) సామాజిక బాధ్యతగా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని నగర పాలక కమిషనర్ పి.విశ్వ నాథ్ కొనియాడారు. ఆదివారం కమిషనర్ క్యాంపు కార్యాయలంలో పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలను క్రెడాయ్ సంస్థకు బదలాయింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశారు. కమిషనర్, క్రెడాయ్ జిల్లా చైర్మన్ గోరంట్ల రమణలు ఎంఓయూపై సంతకాలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పాత బస్తీలోని గడియారం ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు స్వచ్ఛందంగా క్రెడాయ్ ముందుకు వచ్చిందన్నారు. గోరంట్ల రమణ మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ సూచన మేరకే గడియారం ఆసుపత్రిని పదేళ్ల పాటు దత్తత తీసుకున్నామన్నారు. తొలుత రూ.20 లక్షలతో ఆధునీకీకరణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజా రోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ కృష్ణలత, క్రెడాయ్ సభ్యులు జి.సాయిరామ్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్, ప్రకాష్, రంగనాథ్‌రెడ్డి, డా.గోపిక్రిష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి : నగరంలోని పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రధాన రహదారులపై రాత్రి వేళల్లో స్వచ్ఛత పనులను ప్రారంభించామని కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. ఆదివారం తెల్లవారుజామున పూలబజార్, పాత ఈద్గా, బళ్లారి చౌరస్తా ప్రాంతాలలో రాత్రి పూట జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలి: నగర పాలక పరిధిలో అనధికార లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. అనధికార లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ను పొడిగించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నగర పాలకలో 30.6.2025 వరకు వేసి అనధికార లేఅవుట్లు, ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుం, 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమ బద్ధీకరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. జూలై 26 నుంచి అక్టోబరు 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హరిత హోటల్ తనిఖీ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటరమణ కాలనీలోని హరిత హోటల్‌ను ఏపీ టూరిజమ్ డెవలప్‌మెంట్ సంస్థ అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.ఎల్.పద్మావతి తనిఖీ చేశారు. ఆదివారం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఆమె మార్గమధ్యలో ఉన్న హరిత హోటల్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి రాజశేఖర్ ఆమెను కలిసి బొకే అందజేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి కరాటే పోటీలను గ్యాస్ట్రో ఎంట్రలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. కరాటే క్రీడతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికల ను అందజేశారు. శిక్షకుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ జన్మదినం పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి 22వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి న్యాయవాది ఎం.శ్రీధర్, 4వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఊట్ల రమేష్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు హాజరై రిబ్బన్ కట్ చేసి పోటీలు ప్రారంభించారు.

కల్లూరు సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం

కల్లూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కల్లూరు సింగిల్‌విండో చైర్మన్ దేవులంకాటి శేఖర్‌ను ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం సన్మానించారు. ఆదివారం కల్లూరు సహకార సంఘం కార్యాల యంలో చైర్మన్ శేఖర్‌ను అభినందించారు. సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పాల్గొన్నారు.

బ్రాహ్మణదొడ్డి చెరువుకు జలకళ

సి.బెళగల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి చెరువు జలకళ సంతరించుకుంది. గత వారం రోజులు నుంచి పులకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి ఎల్లెల్సీ కాలువ ద్వారా సాగు నీరు విడుదల చేశారు. దీంతో బాహ్మణదొడ్డి చెరువుకు నీటితో కళకళలాడుతోంది. చెరువు కింద దాదాపు 155 ఎకరాలు వరి పంట సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సి.బెళగల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి, చింతమానుపల్లె గ్రామాల్లోని రౌడీ షీటర్లకు ఎస్ఐ పరమేష్ నాయక్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కల్లూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళ, శిశుసంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం సంఘం చైర్‌పర్సన్‌గా నియామకమైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని జిల్లా వికలాంగ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు, ఉద్యోగులకు పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రుణం అందించాలని, 55 ఏళ్లు దాటిన దివ్యాంగ ఉద్యోగులకు కారుణ్య నియామకం కింద కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. జాతీయ రహదారుల్లోని టోల్‌గేట్‌లో దివ్యాంగులకు కేంద్రప్రభుత్వ గుర్తింపు కార్డు మినహాయింపు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. నాయకులు శివారెడ్డి, క్రిష్ణుడు, సాంబశివరావు పాల్గొన్నారు.

ఎన్.కొంతలపాడులో వైద్య శిబిరం

ఓర్వకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడులో ఆదివారం కర్నూలు అమీలియో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు రక్త, కంటి, గుండె, పంటి జబ్బులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. నాయకులు మధుసూదన్‌గౌడు, వెంకటేశ్వర్లు, రామకోటేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

చందాల పేరిట ఇబ్బంది కలిగిస్తే చర్యలు

తుగ్గలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చందాల పేరిట వాహనదారులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తుగ్గలి జొన్నగిరి ఎస్‌ఐలు బాల నరసింహులు, మల్లికార్జున హెచ్చరించారు. చిన్నపిల్లలు రోడ్లకు అడ్డంగా తాళ్లు కట్టి వాహనాలు ఆపి చందాలు వసూలు చేయకూడదన్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతారని ఎస్‌ఐలు తెలిపారు.

సుల్తానాపురం గ్రామం దత్తత

ఆదోని, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తాను మండలంలోని సుల్తానాపురం గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ తెలిపారు. గ్రామంలో తనకు ఎవరూ లేకున్నా ప్రజలకు అండగా నిలవాలని పనిచేస్తున్నానన్నారు ఆదివారం స్వయంగా పారిశుధ్య పనులు చేసి, చెత్తను శుభ్రం చేశారు. గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని, రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నాయకులు గుడిసె శ్రీరాములు, మురళీ, మాజీ సర్పంచ్ మాధవ్, వడ్డేమాన్ గోపాల్, మండిగిరి బాబు రావు ఉన్నారు.


కాలువ పూడిక తీస్తున్న కృష్ణమ్మ

రహదారుల విస్తరణకు నిధులు ఇవ్వాలి



కేంద్రమంత్రి గడ్కరీకి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణకు నిధులు కేటాయించాలని ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి కోరారు. ఆదివారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం ఇచ్చారు. కర్నూలు నుంచి బళ్లారికి 150 కి.మీ. ఉందని, నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలన్నారు. పశ్చిమ ప్రాంతంలో రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తి నుంచి ఆదోని మీదుగా మాన్వికి వెళ్లేందుకు నేషనల్ హైవే 147 నుంచి 162ను కలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు రూ.102 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు పంపామన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

స్నేహం జీవితంలో భాగం

ఆస్పరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్నేహం జీవితంలో భాగమని హెచ్‌ఎం నరేష్ ఆచారి తెలిపారు. ఆదివారం నారాయణ ప్రైమ్ పాఠశాలలో ఫ్రెండ్ షిప్‌డే నిర్వహించారు. కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అందరితో స్నేహభావం కలిగి ఉండాలన్నారు. పవన్, భరద్వాజ్, సతీష్‌కుమార్, సీతారాముడు, పద్మావతి, నీలకంఠ, అశ్వని, పవిత్ర పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

'అన్నదాత సుఖీభవ' రైతుకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ'తో ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు రూ.7 వేలు జమ చేసిందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం ఆలూరులో మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో భాగంగా సీఎం చంద్రబాబు మహిళలకు ఉచిత గ్యాస్, తల్లికి వందనం, పెన్షన్ల పెంపు అమలు చేశారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పిస్తారన్నారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. నెట్టప్ప, సాలిసాహెబ్, వన్నూరువలి, రాముయాదవ్ పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద: మండలంలోని దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పంపాస్వామి, మహేష్ స్వామి మాట్లాడుతూ తెల్లవారు జాము నుంచి మహా మంగళహారతి, ఆకు పూజ, రుద్రాభిషేకం నిర్వహించామన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారం


ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్

మద్దికెర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్దికెర, ఎం.అగ్రహారం, బొజ్జనాయునిపేట గ్రామాల లో వోల్టేజీ సమస్య పరిష్కారమైనట్లు విద్యుత్ ఏఈ మహ్మద్ రఫి తెలిపారు. ఆదివారం సబ్ స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చినట్లు తెలిపారు. లైన్‌మెన్ వెంకటరమణ ఉన్నారు.

హంద్రీ-నీవా జలాలు రైతులకు వరం


మాట్లాడుతున్న రైతులు, టీడీపీ నాయకులు

తుగ్గలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా నీటితో చెరువులను నింపడం రైతులకు వరమని సొసైటీ డైరెక్టర్ భీమలింగప్ప చౌదరి, మల్లయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాంపురంలో మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రెండు రోజుల క్రితం రాంపురం, రాంపురం కొట్టాల గ్రామాలకు కాలువలకు నీరు విడుదల చేశారని, రైతులు రుణపడి ఉంటారన్నారు. మద్దిలేటి చౌదరి, మహ్మద్ రఫి ఉన్నారు.

తారుమారు


మూడు నెలలకే దెబ్బతిన్న పగిడిరాయి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి

తుగ్గలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిరాయి రైల్వేస్టేషన్ రహదారిని మూడు నెలల క్రితం రైల్వే అధికారులు నిర్మించారు. అయితే నాసిరకంగా నిర్మించడంతో తారు లేచిపోయి గుంతలు పడ్డాయి. ఈ దారిలోనే రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు వెళుతుంటారు. నాసిరకంగా పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాళ్లదారి

హాలహర్వి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచనూరు-హాలహర్వి రహదారి కంకర తేలి రాళ్లదారిగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మెటల్ రోడ్డు వేయగా, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో రాళ్లు తేలాయి. దాదాపు 2 కి.మీ.ల రహదారి నడిచేందుకు కూడా వీలు కావడం లేదని నూతన రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కంకరతేలి అధ్వానంగా మారిన మాచనూరు రోడ్డు

పొలాన్ని తడిపేందుకు అవస్థలు

- డీజిల్ ఇంజన్‌తో ఎకరాకు రూ.10వేలు ఖర్చు..
- హంద్రీనీవాకు పిల్లకాలువలు లేకపోవడమే కారణం


కాలువ వద్ద ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేస్తున్న రైతులు

దేవనకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినుకు జాడ లేకపోవడంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నారు. దేవనకొండ, గద్దెరాళ్ల, కుంకనూరు, ఆలారుదిన్నె, కప్పట్రాళ్ల గ్రామాల రైతులు పంటలను కాపుడుకునేందుకు తిప్పలు పడుతున్నారు.

పిల్ల కాలువలు లేక అవస్థలు..

హంద్రీనీవా కాలువలో నీరు పారుతున్నా పిల్ల కాలువలు లేకపోవడంతో నీరందడం లేదు. మండలంలో 50వేల ఎకరాల్లో పొలాలు ఉన్నాయి. అయితే పిల్ల కాలువలు లేకపోవడంతో నీరందడంలేదు.

ఆయిల్ ఇంజన్లతో నీరు..

పంటలను ఎలాగైనా బతికించుకోవాలన్న ఆశతో రైతులు ఆయిల్ ఇంజన్ల ద్వారా నీరందిస్తున్నారు. దాదాపు మూడు వారాలకుపైగా వర్షం లేకపోవడంతో భూమి ఎండిపోయి కాలువలోని నీటికి పీల్చేస్తోంది. దీంతో ఉన్న కొద్ది నీటినే వాడుకుంటున్నారు. గంటకు లీటర్ డీజిల్ ఖర్చు కాగా, ఇంజన్ బాడుగ రోజుకు రూ.వెయ్యి, ఒక్కో పైపుకు రూ.10 ప్రకారం చెల్లించాలి. రోజుకు 8 గంటలు పంప్ చేసినా, ఎకరాకు మాత్రమే నీరందుతోంది. ఇలా ఎన్ని ఎకరాలు ఉంటే అంత ఖర్చు అవుతోంది. ఈ లెక్కన ఎకరాకు దాదాపు రూ.2వేలు అవుతోంది. అయిదు ఎకరాలు ఉంటే రూ.10వేలు ఖర్చు అవుతోంది. దీతో తమకు గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్ల కాలువలు ఏర్పాటు చేయాలి.



పిల్లకాలువలు ఉండింటే ఖర్చు తగ్గేది. ఎకరా పంటను తడిపేందుకు దాదాపు ఎనిమిది గంటల సమయం పడుతుంది. మూడు ఎరకాలకు రూ.30 వేల దాక ఖర్చు వస్తుంది. **- మురళి, రైతు, దేవనకొండ**



- ఈ రైతు కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన ఖాజ ఉశేన్. 14 ఎకరాల్లో చీనితోట సాగు చేశాడు. మొక్కలను కాపాడుకునేందుకు నెలన్నర క్రితం జియాలజిస్టుతో సంప్రదించి 780 అడుగుల వరకు బోరు వేయించాడు. అయితే నీరు పటడంలేదు. దీంతో తాను ఖర్చు చేసిన రూ.లక్ష మట్టిపాలైందని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆ ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల నాయకులు ప్రవేశించరాదని ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు సర్కిల్ వద్ద ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలను దహనం చేశారు. పాఠశాలలోకి విద్యార్థి సంఘాల, రాజకీయ నాయకులు ప్రవేశించకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. విద్యార్థి సంఘాలు రాజకీయ కోసం కాదని విద్యార్థుల సమస్యల పరిష్కారానికే పనిచేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శివ, హాజీ, రవి, వినోద్, నాని, వంశీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఘనంగా స్నేహితుల దినోత్సవం


నెహ్రూ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్రాంత ఉద్యోగులు, నెహ్రూ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు లక్ష్మణ, అను అన్వర్ పంపాపతి, సేకరణ కేశవ, నాగరాజు, నల్లన, ఈరన్న, వీరేంద్ర, రుద్రముని, లక్ష్మీ నారాయణ, గోపాల్ పాల్గొన్నారు. అలాగే ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ రహదారి వద్ద నాగప్ప, ఓబుళపతి, శ్రీవాస్, నరసయ్య, సురేష్, రామన్న, రమేష్ నాయుడు కేక్ కట్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మద్దికెర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలుర పాఠశాల 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. మరణించిన స్నేహితుల కుటుంబ సభ్యులు ఆరు మందికి రూ.72వేలు ఆర్థిక సాయం అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ రెడ్డి తనవంతుగా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ప్రతి సంవత్సరం అందిస్తానన్నారు. ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు, రంగస్వామి మాట్లాడుతూ స్నేహం విలువైనదని, పూర్వ విద్యార్థులు మిత్రులను గుర్తించుకుని సాయం అందించడం అభినందనీయమన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దేవనకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు విజయ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, ఆకుల వీరేష్ అన్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

త్వరలో ఉచిత బస్సు పథకం

హాలహర్వి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నట్లు టీడీపీ నాయకులు రమేష్, రఘుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కామినహాల్ గ్రామంలో మాట్లాడుతూ తమ గ్రామ రైతులందరికీ ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ' నగదు జమ అయిందన్నారు.

అధిక ధరలకు ఎరువులు



తెల్ల కాగితంపై ఇచ్చిన బిల్లు

హాలహర్వి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గ్రామంలో కృత్రిమ కొరత సృష్టించి ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తూ బిల్లులు కూడా ఇవ్వడం లేదంటూ సర్పంచ్ తనయుడు నాగరాజు ఆరోపించారు. ఆదివారం మాట్లాడుతూ గూళ్యంలోని ఫర్టిలైజర్, పురుగుమందుల షాపుల్లో తెల్లకాగితంపై రాసి ఇస్తూ రైతులను దగా చేస్తున్నారన్నారు. తానే స్వయంగా రూ.లక్ష విలువ చేసే ఎరువులను కొనుగోలు చేస్తే తనకు బిల్లు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయాన్ని ఏవో వేదానంద దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేసి డీలర్లపై చర్యలు తీసుకుంటామని, తప్పనిసరిగా రైతుకు బిల్లు ఇవ్వాల్సిందేనని చెప్పారు.

రైతుకు మేలు

తుగ్గలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు 'అన్నదాత సుఖీభవ' ద్వారా మేలు కలిగిందని సర్పంచ్ చౌడప్ప, సలహాదారుడు ప్రతాప్ యాదవ్ అన్నారు. ఆదివారం బొందిమడుగులలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే శ్యాంబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

రైతులందరికీ ఇవ్వాలి

మద్దికెర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలని వైసీపీ నాయకులు మల్లికార్జున యాదవ్, ఆర్.వెంకటేశ్వర్లు, కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇంకా చాలా మంది రైతులకు పథకం అందలేదని ఆరోపించారు. 600 మంది రైతులను అనర్హులుగా ప్రకటించడం అన్యాయమన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

మద్దికెర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు బురుజుల కేశవులు, కొత్తూరు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ఏడాదిలోపే ఎమ్మెల్యే శ్యాంబాబు మద్దికెర నుంచి బురుజుల వరకు రూ.5 కోట్లతో రోడ్డు నిర్మించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయకపోగా దౌర్జన్య పాలన చేసిందన్నారు. బురుజులలో రోడ్లు కూడా నిర్మిస్తామన్నారు.

టిడ్కో గృహాలను స్వాధీనం చేయాలి


మీనాక్షి నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

ఆదోని టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను తమకు స్వాధీనం చేయాలని లబ్ధిదారులు కోరారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎమ్మెల్సీ మధుసూదన్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. 11 ఏళ్ల క్రితం రూ.లక్ష చొప్పున మున్సిపల్ అధికారులకు చెల్లించామని ఇంతవరకు స్వాధీనం చేయలేదన్నారు. రుణాల కంతులు చెల్లించాలని బ్యాంకు అధికారులు తమను వేధించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వెంటనే గృహాలు స్వాధీనం చేయాలని, అలా కాని పక్షంలో తాము చెల్లించిన రూ.లక్ష వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులు గణేష్, కమల నాభ శర్మ, కాప్సే పద్మావతి, గైక్వాడ్ అనురాధ, రూపవతి, ఉషారాజ్, వెంకోబరావు పాల్గొన్నారు.


నిట్రవట్టిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

జోరుగా వరినాట్లు

హాలహర్వి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దిగువ కాలువకు నీరు విడుదల కావడంతో మండలంలో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. చింతకుంట గ్రామం నుంచి హొళగుంద మండలంలో రైతులు వరి సాగు చేస్తున్నారు. నీరు విడుదల కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలు సాధించిన యువతకు సన్మానం

దేవనకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి పోలీసులుగా ఎంపికైన వారిని ఆదివారం సన్మానించారు. సింగాపురం గ్రామానికి చెందిన సువర్ణమ్మ, వెలమకూరు గ్రామానికి చెందిన బంగారమ్మ, కుకటికొండ గ్రామానికి చెందిన తెలుగు సువర్ణ సివిల్ పోలీసులుగా ఎంపికయ్యారు. గ్రామస్థులు దస్తగిరి, లోకేష్, హనుమన్న వారిని సన్మానించారు.


సివిల్ పోలీసు సువర్ణను సన్మానిస్తున్న గ్రామస్థులు

వృద్ధాశ్రమంలో స్నేహితుల దినోత్సవం

పత్తికొండ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వృద్ధాశ్రమంలో యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. హోసూరు రోడ్డులో ఉన్న ఆశ్రమంలో ఆదివారం సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి నాగరాజు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనం తరం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఉపాధ్యాయులు మారుతీ, వెంకటేష్‌నాయక్, యువస్పందన సభ్యులు మధుబాబు, గిరీష్, రంగస్వామి ఉన్నారు.


అన్నదానం చేస్తున్న యువకులు

రేపు జర్నలిస్టు కోర్కెల దినోత్సవం

పత్తికొండ టౌన్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు రంగన్న, అధ్యక్షుడు సాలు రంగడు, గౌరవ సలహాదారుడు నాగరాజు అన్నారు. ఆదివారం సమావేశంలో మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించి గృహాలను నిర్మించి ఇవ్వాలన్నారు. బీహార్ తరహాలో గౌరవ వేతనాన్ని ఇవ్వాలని, జర్నలిస్టులు మరణిస్తే కుటుంబానికి పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఆగస్టు 17న ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. మధుగౌడ్, హనుమంతు, రాజ్‌గోపాల్, మధుబాబు, పవన్, రాజుగుప్తా, షేక్షావలి, నూర్, గోపాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

జయప్రదం చేయాలి

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోడుమూరులో ఈ నెల 7వ తేదీ నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం కోశాధికారి కామర్తి హనుమంతప్ప, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఓమేంద్రబాబు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంల పోస్టర్లను విడుదల చేశారు. చేనేతలకు ఏడాదికి రూ.36వేల పింఛన్ పునరుద్ధరించాలని, ఉచిత విద్యుత్‌ను రూ.500లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రూపేంద్రబాబు, గోట్ల శివ ఎల్లయ్య, రవిశేఖర్ పాల్గొన్నారు.

జింకల బెడదతో రైతుల బెంబేలు


అమీనాబాదు వద్ద పొలాల్లో తిరుగుతున్న జింకలు


తుగ్గలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జింకల బెడతో రైతులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని అమీనాబాదు, గిరిగిట్ల, రాతన, తుగ్గలి తదితర గ్రామాల్లో వీటి బెడద అధికంగా ఉందని వాపోతున్నారు. మందలు మందలుగా పంటలపై దాడిచేసి ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, కంది, సజ్జ పంటలను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. వీటి బారి నుంచి పంటలను రక్షించుకునేందు కాపాలా ఉండాల్సి వస్తోందని, పొలాల చుట్టూ కాగితాలు, చీరలతో రక్షణ వలయాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి, జింకల బారి నుంచి తమ పంటలను కాపాడాలని కోరుతున్నారు.

ఎంఎస్ నగర్‌లో సమస్యల తిష్ఠ

● తాగునీటికి ప్రజల అవస్థలు
● పిచ్చి మొక్కలతో నిండిన డ్రైనేజీలు


తాగునీటి సరఫరా లేకపోవటంతో పూడుకుపోయిన కొళాయి


మోటారు ఏర్పాటుకు నోచుకోని బోరు


మురుగు కాలువలో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు

ఎమ్మిగనూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాచాని సోమప్ప పేరుతో ఏర్పాటైన ఎంస్ నగర్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. కాలనీ శివారు ప్రాంతంలో కొన్ని గృహాలకు తాగునీటికి కటకట అనే పరిస్థితి నెలకొంది. కాలనీలో 30,31 వార్డులు కలిసి ఉన్నాయి. కాలనీలో దాదాపు 1400 గృహాలు ఉన్నాయి. రహదారుల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా డ్రైనేజీల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. కాలనీ ఏర్పడినప్పుడు ఏర్పాటు చేసిన డ్రైనేజీలు కావడంతో కొన్ని చోట్ల పూర్తిగా పూడుకుపోగా మరి కొన్ని చోట్ల డ్రైనేజీలకు వేసిన రాళ్లు ఊడిపోయి కాలువలో మట్టి పేరుకుపోయింది. దీంతో మురుగు నీరు ముందుకు సాగక అలాగే నిలిచిపోవడంతో, మురుగుకాలువలు దుర్గంధం వెదజల్లుతోంది. ఎప్పుడో ఒకసారి మురుగు కాలువలను శుభ్రం చేస్తుండటంతో కాలనీలో అక్కడక్కడ కాలువల దిమ్మెలపై గడ్డి పెరిగి పోయింది. అంతేగాక యూజీడీ పైపులైన్ కోసం సీసీ రోడ్లను తవ్వి ప్యాచ్‌లు వేయకపోవటంతో అక్కడ అక్కడ రోడ్ల మధ్యలో గుంతలు పడి వర్షం నీరు నిలుస్తోంది. అంతేగాక కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు కూడా వేయకపోవటంతో మట్టిరోడ్లపైనే రాకపోకలుసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా కాలనీ శివారులో ఉన్న శివాలయం ప్రాంతంలో కొంతకాలంగా తాగునీరు రావటం లేదు. దీంతో ఆ ప్రాంత వాసులు మరో వీధిలోకి వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆలయం దగ్గర బోరు ఉన్న దానికి మోటరు లేకపోవటంతో అది కాస్త నిరుపయోగంగా మారింది. ఇటీవల కాలనీలో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా బోరుకు మోటారు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కాలనీలో సైతం ఆశించిన స్థాయిలో నీటి సరఫరా లేకపోవటంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాఠశాల వెనుక నుంచి వెళ్లే రహదారిలో రెండు చోట్ల వీదిలైట్లు వెలగకపోవటంతో రాత్రివేళ్లలో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. హైస్కూల్ వెనక డ్రైనేజీ లేకపోవటంతో ఇళ్లముందు వర్షం నీరు నిలుస్తోంది. ఇలా ఎంఎస్ నగర్‌లో సమస్యలు తిష్ఠ వేసి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

● **భయపెడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు:** ఇక కాలనీపై దాదాపు 150 గృహాలపై హైటెన్షన్ విద్యుత్ లైన్(తీగలు) మార్కెట్ కమిటి వైపుకు వెళ్లింది. ఈ విద్యుత్ లైన్‌లో ఓ విద్యుత్ స్తంభం ఓ గుడిసెలోనే ఉంది. దీంతో గుడిసె వాసులు భయం భయంతో జీవనం సాగిస్తున్నారు. గతంలో ఓ సారి వర్షం వచ్చినప్పుడు విద్యుత్ స్తంభం ఒరగటంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ లైన్‌ను తొలగించాలని కాలనీ వాసులు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి



పట్టణంలోని ఎంఎస్‌నగర్‌లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కాలనీ శివారులో కొన్ని ప్రాంతాల్లో తారునీరు రావటం లేదు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటిని కూడా ఎదో కొద్దిసేపు వదలటం వల్ల పనులకు వెళ్లిన వారు నీటిని నింపుకోలేకపోతున్నారు. డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొత్త డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా కాలనీపై హైటెన్షన్ విద్యుత్‌తీగలను తొలగించాలి. ఇవి ఉంటం వల్ల ప్రజలు భయాందోళనలకు గురువుతున్నారు.

- రంగన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి, ఎమ్మిగనూరు

పైపులైన్ ఏర్పాటు చేస్తున్నాం



ఎంఎస్ నగర్ శివారు ప్రాంతంలో 40ఇళ్లకు తాగునీటి సమస్య ఉండటంతో శిల్పా కాలనీ మీదుగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. అలాగే కాలనీలో రెండు చోట్ల సీసీ రోడ్లు లేకపోవటంతో కొత్తగా వేసేందుకు గత నెల కౌన్సిల్‌లో తీర్మాణం చేయటం జరిగింది. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నాం.

- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

జనసేన బలోపేతానికి కృషి చేద్దాం


జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్నను సన్మానిస్తున్న కార్యకర్తలు

మంత్రాలయం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి జనసేన కార్యకర్తలు సైనికులుగా పార్టీ కోసం కృషి చేద్దామని జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న అన్నారు. ఆదివారం మంత్రాలయంలోని లక్ష్మన్న నివాసంలో కౌతాళం మండలం జనసేన నాయకులు చిన్న, వెంకప్ప, రమేష్, నాగరాజు, నూకప్ప, శివ, రాజేష్, గంగాధర్ లక్ష్మన్నను కలిసి కౌతాళం మండలంలో జనసేన పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగప్ప, ఈరన్న, రవి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

మంత్రాలయం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 పదో తరగతిలో చదువుకున్న డి.భీమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా 2003-04 పదో తరగతి బ్యాచ్ మిత్రులందరూ అందరూ విరాళాలు సేకరించి దాదాపు రూ.60 వేలు తోటి మిత్రుడు భీమేష్ కూతురు దీక్షిత పేరు మీద కెనరా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాన్ని మృతుడు భీమేష్ భార్య రాధమ్మకు ఆదివారం అందజేశారు. తోటి స్నేహితుడు కోల్పోవడం బాధాకరమని, స్నేహితుల దినోత్సవం సందర్భంగా మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని రూ.60వేల బ్యాంక్ డిపాజిట్ పత్రాన్ని అందజేసి అండగా నిలిచారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం


కేడీసీసీబీ చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నందవరం నాయకులు

నందవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నందవరం మండలానికి యూరియా కొరత లేకుండా చూస్తామని కేడీసీసీబీ జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నందవరం టీడీపీ నాయకులు కర్నూలులో ఆయనను కలసి సన్మానించి సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా నందవరం మండలానికి యూరియా కొరత అన్నదే రాకుండా చూస్తామని సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్‌కు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ కాశీంవలీ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు, ఎల్లప్ప, శేఖర్ పాల్గొన్నారు.

ఆలయాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి


తుంగభద్ర తీరంలో శుభ్రం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మంత్రాలయం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆలయాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై వ్యర్థాలను తొలగించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మన ఊరు - మన గుడి - మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ శివకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రాలయం తుంగభద్ర నది నీటి మట్టం పూర్తిగా తగ్గిపోవడంతో పేరుకుపోయిన మట్టి, బురద, చెత్తాచెదారాన్ని వంద మంది స్వచ్ఛత సంస్థ సిబ్బంది శుభ్రం చేశారు. తుంగభద్ర నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలన్న ఉద్దేశంతో వీఐపీ ఘాట్, గణేష్ ఘాట్, గంగమ్మ గుడి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఇలాంటి సంస్థలతో పాటు ప్రజలకు కూడా పూర్తిగా సహకరించి ఉత్సవాలకు, పరిశుభ్రతకు కలిసిరావాలని కోరారు.

శ్మశానంలో అభివృద్ధి పనులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సగరుల స్మశాన వాటికలో సంఘం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సగర సంఘం అధ్యక్షుడు వీరేంద్ర, ప్రధాన కార్యదర్శి బాలాజి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సగరుల స్మశాన వాటికలో వారు మాట్లాడుతూ భూమి విలువలు పెరగడంతో కబ్జాదారులు స్మశాన వాటిక స్థలాన్ని కూడా కబ్జా చేస్తుండడం వల్ల ఈ రోజు వీటిని కూడా కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఎల్లప్ప, కోశాదికారి మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరి చరణ్, పెద్దలు రామకృష్ణ, రాముడు పాల్గొన్నారు.

బాలకృష్ణ అభిమానుల సంబరాలు

ఎమ్మిగనూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన భగవత్ కేసరి చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఎంపికకావటంతో బాలకృష్ణ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం పట్టణంలోని చంద్ర హోటల్ దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నందమూరి ఫ్యాన్స్ చంద్రన్న, తెలుగురాముడు, రమేష్, రంగస్వామి గౌడ్‌లు కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో అభిమానులు బోడబండ రంగస్వామి, వాల్మీకి రాజు, వీరేష్, రాముడు, గిడ్డయ్య, ఈరన్న, పక్కీరప్ప పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి


రైతులతో మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు బుట్టా నీలకంఠ

ఎమ్మిగనూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని వైసీపీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీని నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్‌కు రైతులు విక్రయించేందుకు తీసుకొచ్చే పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరూపాక్షి రెడ్డి, మాచాన వెంకటేష్, సునీల్ కుమార్, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ కొమ్ము రాజు, కోటకొండ నరసింహులు, మహబూబ్ బేగ్ పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ చేనేత విభాగం నాయకులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు 200 యునిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించటం హర్షణీయమని టీడీపీ చేనేత విభాగం నాయకులు మిన్నప్ప, దేవేంద్ర, బిజ్జే నాగరాజు, నరసింహులు, టౌన్ బ్యాంకు వైస్‌చైర్మన్ బండా నరసప్పలు అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, చేనేత, జౌళి శాఖమంత్రి సవితకు, ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డికి చేనేతలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు రాజు పాల్గొన్నారు.

వెండి రథంపై ప్రహ్లాదరాయలు


వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం శ్రావణ మాస నవమి శభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణభోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో మంత్రాలయం కిక్కిర్సింది.

గర్భగుడి స్తంభాలకు బంగారం కవచాలు

రాఘవేంద్రస్వామి మూలబృందావనం ఇరువైపులా ఉన్న స్థంబాలకు బంగారం కవచాలను చేయించి ఇచ్చేందుకు భక్తులు ముందుకు వచ్చారు. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో గతంలో ఉండే వెండి కవచాలపై బంగారం పూత పూయించి కవచాలను అమర్చేందుకు ఓ భక్తుడు విరాళం ఇవ్వవడంతో కవచాలను అందంగా తీర్చిదిద్దారు. గురువారం రాఘవేంద్రస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రయోగాత్మకంగా అలంకరణ చేశారు. ఉత్సవాలనాటికి పూర్తిగా అలంకరణ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బృందావనానికి ఇరువైపుల ఉన్న స్థంబాలకు బంగారుతో అలంకరణ చేయడంతో గర్భాలయానికి నూతన కళ ఏర్పడింది. బంగారు కవచాల ఏర్పాటుకు సహకరించిన భక్తునికి పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.


బృందావనం స్తంభాలకు బంగారు పూత కవచాలతో అలంకరించిన దృశ్యం

రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి, కౌన్సిలర్ దయాసాగర్ అన్నారు. ఆదివారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో బీజేపీ కార్యకర్తలతో కలి సి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ నిధి పథకం 20వ విడత కింద రూ 25వేల కోట్లను రైతుల ఖాతాల్లోకి జమ చేశారన్నారు. ఈ పథకం ద్వారా 9.70 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నందవరం మండల నాయకులు గురురాజ్ దేశాయ్, జగ్గాపురం చిన్న ఈరన్న, కో కన్వీనర్ తోగట నరసింహులు, మండల అధ్యక్షులు వేంకటేష్, లలిత్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ శ్రీనివాసులు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నేర ప్రవర్తన కలిగిన రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిచి హెచ్చరించారు. వారి నుంచి పట్టణ ప్రజలకు, సమాజానికి ఎటువంటి హాని జరగకుండా ఉండాలని తెలిపారు, సదరు విషయాలపై గురించి కౌన్సెలింగ్‌కు పిలిచామన్నారు. హాజరు కాని వారు వివరణ ఇవ్వాలని కారణం తమకు తెలుపాలని హెచ్చరించారు.

నేడు అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ

కోసిగి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని వాల్మీకి సర్కిల్ సమీపంలో సోమవారం అన్న క్యాంటీన్ ఏర్పాటుకు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, ఆర్లబండ సహకార సంఘం చైర్మన్ నాడిగేని అయ్యన్న తెలిపారు. కార్యక్రమానికి కర్నూలు పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటు ఈఈ చంద్రశేఖర్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ విరుపాక్షి హాజరవుతున్నారనీ అన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. కొటేకల్లు గ్రామానికి చెందిన ఈరన్న శెట్టి (67) జూలై 25వ తేదీన అదే గ్రామానికి చెందిన అలీసాహెబ్‌తో కలిసి వస్తుండగా మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న బాబాఫరీద్ సమీపంలో ఎర్రకోట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొట్టారు. దీన్ని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందారు.. ఇదిలా ఉండగా కర్నూలు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది ఈరన్న శెట్టి మృతి చెందిన విషయం దాచిపెట్టి రూ.6లక్షలు తమవద్ద వసూలు చేశారని మృతుడి బంధువులు ఆరోపించారు. మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయం


విద్యార్థులను సన్మానించిన వసతిగృహం అధికారులు

ఎమ్మిగనూరు, ఆగసు 3(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో ఉంటు డిగ్రీ చదువుతూ పోలీసు ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక కావ టం అభినంద నీయమని వసతి గృహం సంక్షేమ అధికారులు విశ్వనాథరెడ్డి, అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం లలో వసతిగృహాల్లో ఉంటు 14 మంది డిగ్రీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వసతి గృహం అధికారులు సన్మానించారు. విద్యార్థులు అధికారులను సన్మానించి కృతజ్ఞత చాటుకున్నారు.

'ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి'

పెద్దకడబూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకుల ప్రవేశించకుండా ప్రభుత్వం జీవో జారీ చేయడం హేయమైన చర్య అని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తాలుకా కార్యదర్శులు షేక్షావలి, జాఫర్‌పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో జీవోలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం, విద్యారంగంలో అన్యాయాలపై పోరాటాలు చేస్తుందన్నారు. జారీ చే సిన జీవోను రద్దు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మహబూబ్, అల్లాబకాష్, దాద్‌పీర్, ఎస్ వలి పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్రంలో కార్పొరేట్ చదువులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని విద్యార్థి సంఘాల గొంతును నొక్కే విద్యాశాఖ నూతనంగా తీసుకువచ్చిన జీవోను వెనక్కు తీసుకోవాలని ఆర్‌పీవీఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. ఆదివారం మంత్రాలయంలో ఆర్‌పీవీఎఫ్ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. జీవో ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు. చీకటి జీవోను రద్దు చేయకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, వీరేష్, రామాంజి, రవీంద్ర నాయక్ పాల్గొన్నార్లు.

కోసిగి: విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలలో విద్యార్థి సంఘాలు ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశంచకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల జీవో కాపీలను ఆదివారం కోసిగి వాల్మీకి సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని,విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం విద్యారంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థి సంఘాలను అణిచి వేయడమే లక్ష్యంగా ఈ ఉత్తర్వులు ఉన్నాయనీ, తక్షణమే విడుదల చేసిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, కుమార్, రవి, వినోద్, చిన్న, బాలాజీ, అబి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



జీవోలను చూపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు